# పూరి గుడిశలో ::

రచయిత : జ్ఞానశ్రీ

అది ఒక పూరి గుడిశ...

మిణుకు మిణుకు మనే దీపపుకాంతి చీకటిని పారద్రోలటానికి ప్రయత్నిస్తున్నాది.

చిన్న చిరుగాలి ఈతచాపల తలుపు సందులోంచి వస్తూంటంచేత గాబోలు దీపానికి నిశ్చలత్వం లేకుండా పోతున్నాది.

తాటిరేకుల చాపమీద పడుక్కొని తదేక ధ్యానంగా ఆలోచిస్తున్న మాధవి... ఒక్కసారి దీపంవేపు చూసింది... ఆ దీపంలో నిశ్చలత్వంలేదు.

తన హృదయంలాగే ఆదీపంకూడా కొట్టుకొంటున్నాది...ఆమె అలాగే చూస్తున్నాది.

స్త్రీ అయినా...పురుషుడైనా...జీవితము తరలించుకోటానికై యెవరికీ ఒకరికి తలయొగ్గకతప్పదు. అంతమాత్రంచేత ఆ జీవి ఆశ్రయునకు గాని...సమాజానికిగాని చులకనగాదు ...అయితే ఈ సూత్రాన్ని మాత్రం గమనించక స్వార్థపరులైన ధనికస్వాములు బీదస్త్రీల శీలాన్ని తమ కామతృష్ణకు బలీయ ప్రయత్నిస్తూంటారు.

ఈనాడు మాధవికి ఈ సన్నివేశమే యెదురుగా నిలుచుంది.

కిసన్‌లాల్ మిల్లు ఆ పధ్నాలుగు పరగణాలకూ మంచి ప్రసిద్ధికెక్కింది... ఈ అవకాశాన్ని పురస్కరించుకుని లక్షలు ఆర్జించేడు. దానితో అతని హృదయంలో గర్వంతోబాటు పాపపు టూహలు కూడా గాఢంగా ప్రభలిపోయేయి...ఆ పాప పంకిలములోపడి అనాథస్త్రీలు యెందరో తమ శీలాన్ని గోలుపోయేరు.

ఇప్పుడు అతనిదృష్టి మాధవివైపు తిరిగింది.

ఆ విషపుచూపులు ... కుటిలహాసం ... కుచేష్టలు...ఆమెలో తుఫాను లేవదీసేయి.

ఒంటిగా చిక్కితే పట్టి బంధించాలనే దృష్టిలోవున్న కిసన్‌లాల్ ఆరోజు మాటువేసుకు కూర్చున్నాడు...ఆ సంగతి గ్రహించిన మాధవి ఆ రోజు కూలిక్కూడా తీసుకోకుండా తొందర తొందరగా వచ్చి తన గుడిశెలో వ్రాలిపోయింది.

బానిసదేశము ప్రజాదేశమైనా బీదలరక్తాన్ని పానకంలా త్రాగే ధనమదాంధుల కుటిలతర విజ్ఞానం యింకా తగ్గలేదు...సరికదా మరింత పెచ్చుపోతున్నాది...వారి అవినీతి కార్యాలకు హద్దుపద్దూ లేదు...దురాగతము అనే అగడ్తకి చిక్కి తపించి నీరసించిపోతూన్న బీద బికారులను ఆదరించేవారు లేక అలాగే జీవితాలను గోలుపోతున్నారు.

శీలాన్ని బలిగొందామనే ఆశతో కూర్చున్న కిసన్‌లాల్ మాధవి కనిపించబోయేసరికి హృదయారాటం యెక్కువయింది... దానితోబాటు కామతృష్ణ కూడా పెరిగి కూర్చుంది.

వెంటనే ఆఫీసురూములోంచి బయలుదేరేడు.

* * *

రాత్రి పదిమీద ఒకగంట దాటివుంటుంది... ఆ పూరిగుడిశలో ఆ దిక్కుమొక్కులేని మాధవి... తాటిరేకుల చాపమీద పడుక్కొని ఆలోచిస్తున్నాది.

చిన్న చినుకులు రాలుతున్నాయి ... దూరాన్ని చలికి భరించలేని కుక్కలు మోరలెత్తి అరుస్తున్నాయి...

ఈదరగాలి తడక సందులోంచి గదిలో ప్రవేశిస్తున్నాది...ఆమె ఆలోచిస్తున్నాది.

"బీదలైనంత మాత్రంచేత శీలానికి దూరం కావాలా ... యెంతటి నీచం ... బీదవారల మొర అరణ్య రోదనగా మారవలసినదేనా...???

దిక్కులేని దీనావస్థలో విడిచిపోయిన తల్లిదండ్రులు...మతకలహాలలో ప్రాణాలుగోలుపోయిన భర్త...పోగా కడుపు కరడుకట్టకుండా కూలిచేసు

కుని బ్రతుకుదామనుకుంటున్న తనని పోషిస్తున్న యజమాని తన శరీరాన్ని ఆసించి ప్రయత్నిస్తున్నాడు ...యిదేనా న్యాయం...ఇదేనా ధర్మం?''

హటాత్తుగా తలుపు చప్పుడైంది...కిసన్‌లాల్ శంటువాసనలతో లోపల ప్రవేశించేడు.

అతని కళ్ళు యెర్రగా వున్నాయి...ఆమె గుండెలు భయంతో గడగడలాడేయి.

కాని ఆమెలో హటాత్తుగా చిన్న వూహ బయలుదేరింది.

చావు బ్రతుకులలో గాని...మానరక్షణలో గాని...దేశదాస్య విచ్ఛేదనలో గాని... ప్రాణరక్షణ ఏతెగకైనా (స్త్రీ పురుషుడు) ధైర్యస్థయిర్యాలు హటాత్తుగా హృదయకుహరంలో ప్రవేశిస్తాయి... అలాగే మాధవిలో కూడా అభిప్రాయం కలిగింది.

వెంటనే దగ్గరలో నేవున్న చాకు మొలలో దోపుకుని లేచి నుంచుంది.

కిసన్‌లాల్ పూర్తిగా నిండిన మత్తులో ఆమె దగ్గరకు ప్రవేసించి...

“ప్యారీ...! జీవితం హాయిగా పూలపాన్పు మీద సాగిపోవాలంటే ధనం ప్రధానం...యిదిగో యింద యీ నోట్లకట్టగ్రహించి నన్ను ఆనందపరచు. కొంకిపట్టు పట్టేవా చెడిపోతావు...”

అంటూ దగ్గరగా వచ్చి చెయ్యిపట్టుకుని నోట్లకట్ట అందించేడు.

ఆమె నోట్లను విసరికొట్టి చెయ్యి బలవంతంగా లాక్కుని...

“తుచ్ఛుడా! పరువుగల స్త్రీ ధనానికి మానాన్ని విక్రయించదు ...... శీలవతియైన యిల్లాలు మానానికి ప్రాణం ఒడ్డుతుంది...నీ ధనం పుణ్యస్త్రీలకు గాని, పరువుగల వారికి కాదు. నన్ను కాని అంటేవా ప్రాణాలు గోలుపోతావు'' అంటూ ప్రక్కకు తప్పుకుంది.

కిసన్‌లాల్ మూర్ఖంగా ఆమెను బలవంతం చేయబోయేసరికి మాధవి చేతనున్న కత్తి ఆమె హృదయారాటం తీరేలా అతడి హృదయంలోకి చొచ్చుకుపోయింది.

ప్రాణాలు పోతూన్న కిసన్‌లాల్ చేతిలో చిక్కిన ఆమె మెడకాయ అతగాడి బలానికి తట్టుకోలేక ప్రక్కకి ఒరిగిపోయింది.

ఇద్దరూ అలాగే నేలకి ఒరిగిపోయేరు. అతని హృదయంలో ఆమె కత్తి... ఆమె కంఠం చుట్టూ అతని చేతులు అలంకారాలుగా వుండిపోయేయి.

ఆ రెండు శవాలు అలాగే వుండిపోయేయి... గాలికి దీపం ఆరిపోయింది.

అంతే........

ఆయుర్వేద వైద్యనిలయం - వారి

“లుకోరియా క్యూర్”

అద్భుత కుసుమరోగ నివారిణి.

స్త్రీలకు తరుచు సంభవించు శ్వేతరక్త ప్రదరరోగములకు, బహిష్టు నొప్పులకు దివ్యౌషధమని 10 సం॥ అనుభవముచే చెప్పగలుగుచున్నాము. ఇంకను దీనిని సేవించుటవలన ఇతర గర్భాశయ వ్యాధులను కూడ నిర్మూలించి వంధ్యత్వమును తొలగించును. అనేకమంది దీర్ఘరోగులకు వాడి గుణము కనుగొనబడిన ఆయుర్వేద ఔషధము.

90 మాత్రల ప్యాకెట్లు—వెల రు. 2-8-0.

ప్యాకింగు పోస్టేజి అదనము.

ఆయుర్వేద వైద్యనిలయం

రామానాయుడుపేట, మచిలీపట్నం.

అన్ని మందుల షాపులలోనూ దొరకును.